# సాక్షి
## రాజన్న సిరిసిల్ల

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024






**నవరాత్రులకు సిద్ధం**

వేములవాడ: రాజన్న ఆలయంలో శనివారం నుంచి జరిగే నవరాత్రోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నాగిరెడ్డి మంటపంలో ప్రత్యేక మంటపాన్ని ఏర్పాటు చేశారు.



**అనంతగిరికి నీటి విడుదల**

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి అనంతగిరి ప్యాకేజీ-10కు 6,400 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రస్తుత నీటిమట్టం 23.144 టీఎంసీలు ఉంది.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/25.0

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో చిరుజల్లులు కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ప్రభుత్వ ప్లీడర్‌గా కల్యాణ చక్రవర్తి



జిల్లా జడ్జిని కలిసిన కల్యాణ చక్రవర్తి

సిరిసిల్లటౌన్: జిల్లా న్యాయస్థానం ప్రభుత్వ ప్లీడర్‌గా సిరిసిల్ల పట్టణానికి చెందిన టి.కల్యాణచక్రవర్తి నియమితులయ్యారు. శుక్రవారం జిల్లా జడ్జి ఎస్.ప్రేమలతను మర్యాద పూర్వకంగా కలిశారు.

### కేటీఆర్ స్వార్థం వీడాలి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే కష్టాల్లో తోడుండాల్సిన సిరిసిల్ల ఎమ్మెల్యే స్వార్థంతో ఉండడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలోని తన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నేతన్నలకు రూ.275కోట్లు బకాయిలు పెడితే ఇప్పటికీ 80 శాతం వరకు కాంగ్రెస్ సర్కారు తీర్చిందన్నారు. ప్రకృతి విపత్తులతో ప్రజలు కష్టాలు పడుతుంటే.. ప్రతిపక్ష నాయకుడు ఫాంహౌజ్‌లో, కేటీఆర్ అమెరికాలో ఉంటున్నారని విమర్శించారు. చెల్లెకు బెయిల్ కోసం ఢిల్లీకు వందలసార్లు తిరిగినా కేటీఆర్‌కు.. తన నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు నెలలో ఒక్క రోజు కూడా దొరకడం లేదా అని ప్రశ్నించారు. సిరిసిల్ల కేంద్రంగా ఫోన్‌ట్యాపింగ్ చేయించిన కేటీఆర్ తన బండారం బయటపడుతుందనే అమెరికా వెళ్లాడన్నారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, సీనియర్ నాయకుడు గడ్డం నర్సయ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, ఆడెపు చంద్రకళ, కల్లూరి చందన, సూర దేవరాజు, గోనె ఎల్లప్ప, రాగుల జగన్ పాల్గొన్నారు.

### విశ్వహిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో నాయకులు

వేములవాడ: విశ్వహిందూ పరిషత్ ఆవిర్భవించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని గాయత్రీమాత ఆలయంలో శుక్రవారం వివిధ కులసంఘాలు, ధార్మికసంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ముఖ్య అతిథి రుద్రోజు స్వరూప మాట్లాడుతూ హిందువుల సంఘటితంపై వివరించారు. కరసేవకులు గర్షకుర్తి వెంకటేశ్వర్లు, విశ్వహిందూ పరిషత్ నాయకులు గడప కిశోర్‌రావు, నాగుల రాము, గోపాలకృష్ణ, చందనం రాజేశ్, సనుగుల భాస్కర్, నవీన్, ఉడుతల బాలు, మామిండ్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### మరమ్మతు చేయిస్తాం



తెగిన కాజువేను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం పరిధిలో వరదలతో కొట్టుకుపోయిన రోడ్లు, కల్వర్టులు, వంతెనలు, కాజువేలను మరమ్మతు చేసేలా కృషిచేస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి-అక్కపల్లి మధ్య కొట్టుకుపోయిన కాజువేను శుక్రవారం పరిశీలించారు. 'తెగిన రోడ్లు.. నిలిచిన రాకపోకలు' అనే శీర్షికతో శుక్రవారం సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు, కాంగ్రెస్ నాయకులు స్పందించారు. రాచర్లగొల్లపల్లి-అక్కపల్లి గ్రామాల మధ్య గల లింకురోడ్డు కాజువేను పరిశీలించి, తమతో ఉన్న ఎంపీడీవో సత్తయ్యకు పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. పీఆర్ డీఈ శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి రోడ్డు దుస్థితిపై తెలిపినట్లు చెప్పారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో మాట్లాడి అన్ని రోడ్లను మరమ్మత్తు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుండాడి రాంరెడ్డి, పందిర్ల సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

- సీఐడీ పోలీసుల పేరిట ఫోన్లు
- పిల్లలు నేరం చేశారంటూ బెదిరింపులు
- డబ్బులు సర్దుబాటు చేయాలని బెదిరింపులు
- వాస్తవాలేమిటో తెలియక కన్నపేగుల కలవరం
- రాజన్నసిరిసిల్ల జిల్లాలో రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు



# సైబర్ వల.. తల్లిదండ్రుల విలవిల

'అతను సిరిసిల్లకు చెందిన ప్రముఖ వ్యాపారి. వాళ్ల కొడుకు ఏడాది క్రితం ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లాడు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వాట్సాప్ కాల్ ఆ వ్యాపారిని హైరానా పెట్టింది. యూనిఫామ్‌తో ఉన్న ఓ పోలీస్ ఉన్నతాధికారి ఫొటో, సీఐడీ పోలీస్ అనే అక్షరాలతో డీపీ ఉన్న వాట్సప్ కాల్‌ను చూసి ఆందోళన చెందాడు. వెంటనే కాల్ మాట్లాడగా.. అవతల వ్యక్తి గంభీరమైన గొంతుతో హాలో అంటూనే సదరు వ్యాపారి పేరు, అతని కొడుకు పేరు చెప్పి.. ×మీ అబ్బాయి నేరం చేశాడు. ప్రస్తుతం మా అదుపులో ఉన్నాడు. రూ.20లక్షలు సర్దుబాటు చేస్తే జైలుకు పంపించకుండా కాపాడుతాను' అంటూ బెదిరింపులు. సదరు వాట్సాప్‌కాల్‌లో మాట్లాడుతున్న వ్యక్తి ఫోన్ కట్ చేయకుండా కట్టడి చేస్తూనే డబ్బులు పంపించాలని వేధించడంతో ఫేక్‌కాల్ అని గుర్తించి వెంటనే ఆ కాల్‌ను కట్ చేశారు. అంతలోపే ఆ వ్యాపారికి గుండెపోటు వచ్చినంత పనైంది.

'అతను సిరిసిల్లకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి. వాళ్ల కూతురు యూకేలో చదువుకుని జాబ్ చేస్తుంది. అతనికి సైతం వాట్సాప్ కాల్ వచ్చింది. అమ్మాయి పేరు, తల్లిదండ్రుల పేర్లు చెప్పి నిర్ధారించుకోవడంతో వాట్సాప్ కాల్‌లో మాట్లాడే వ్యక్తి నిజమైన పోలీస్‌గా భావించారు. అంతలోనే మీ అమ్మాయి నేరం చేసిందని బెదిరింపులు. డబ్బులు ఇవ్వాలని వేధింపులు. అంతేకాకుండా మరింత నమ్మకం కలిగించేందుకు మీ అమ్మాయి మా వద్దనే ఉందని, మాట్లాడిస్తామంటూ.. గందరగోళపు శబ్దాల నడుమ ఓ అమ్మాయి ఏడుపులు వినిపించడంతో సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి హైరానా పడ్డారు. ఇంట్లోనే ఉండి, వాట్సాప్ కాల్ స్పీకర్ ఆన్ చేయడంతో సదరు వ్యాపారి భార్య సైతం ఆ మాటలు విని విలవిల్లాడిపోయింది. తీరా ఫేక్ కాల్ అని, డబ్బుల కోసం సైబర్ నేరగాళ్లు చేసిన పని అని తెలుసుకునే వరకు ఆ తల్లిదండ్రుల హృదయాలు కన్నీటితో నిండిపోయాయి.

సిరిసిల్ల: విదేశాల్లో ఉన్న పిల్లలు, మెట్రోపాలిటన్ సిటీల్లో చదువుకునే పిల్లలు నేరాలు చేశారని, పట్టుబడ్డారని చెబుతూ.. పోలీసుల పేరిట ఫోన్‌కాల్స్ రావడంతో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పలువురు తల్లిదండ్రులు హైరానాపడ్డారు. తీరా వారి పిల్లలు ఫోన్ చేసి అది అంతా ఫేక్ కాల్స్ అని.. డబ్బుల కోసం సైబర్‌నేరగాళ్లు చేసిన పని అని చెప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లోని ప్రముఖులకు ఇలా వాట్సాప్ బెదిరింపు కాల్స్ వచ్చాయి. కొందరు అప్రమత్తమై సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా తప్పించుకోగా.. డబ్బులు అప్పజెప్పిన వారు సైతం ఉన్నారు. ఈ విషయం ఫేక్ అని తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేయకుండా.. లోలోన కుమిలిపోతున్న వారూ ఉన్నారు.

### అంతా సైబర్ క్రైమ్

సిరిసిల్లకు చెందిన ప్రముఖ డాక్టర్ ఒకరు.. సైబర్ నేరగాళ్ల వలలో పడి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.17 లక్షలను బ్యాంకుకు వెళ్లి ఆర్‌టీజీఎస్ ద్వారా సైబర్ నేరగాళ్ల ఖాతాలోకి మళ్లించారు. ఇది ఫేక్ అని తెలిసి సదరు డాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రూ.3 లక్షలు రికవరీ అయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త ఎత్తులతో పోలీస్‌ల ఫేక్ డీపీలతో.. ఫోన్లు చేస్తూ.. వేధిస్తున్న సంఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఫేక్ వాట్సాప్ కాల్స్‌పై పోలీసులకు ఫిర్యాదులు వస్తున్నాయి.

### అలాంటి కాల్స్ నమ్మొద్దు



జిల్లాలో సీఐడీ పోలీసుల పేరిట ఫేక్ వాట్సాప్ కాల్స్ వస్తున్నాయని మాకు సమాచారం ఉంది. ఎవరూ అలాంటి కాల్స్ నమ్మొద్దు. సైబర్ నేరగాళ్లు ఫేక్ డీపీ ఫొటోలతో వాట్సాప్ కాల్స్‌లో బెదిరింపులకు దిగినా భయపడొద్దు. సైబర్ నేరగాళ్లకు డబ్బులు పంపొద్దు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల వలలో పడి ఆర్థికంగా నష్టపోతే.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ, రాజన్నసిరిసిల్ల

# బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, ఎస్సీ అభివృద్ధికి తీసుకున్న చర్యలు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ వేగంగా పూర్తి చేసి చార్జిషీట్ వేయాలని, బాధితులకు సత్వర న్యాయంతోపాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందించాలని సూచించారు. అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాములు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జనార్దన్, కమిటీ సభ్యులు కె.సుధాకర్, రాంచందర్, తిరుపతి, బాలయ్య, బాలరాజు, ఈశ్వర్, పాల్గొన్నారు.

**మెను ప్రకారం భోజనం అందించాలి**

వేములవాడఅర్బన్: విద్యాలయం ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. వేములవాడలోని మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. తరగతి గదులు, టాయిలెట్స్, కిచెన్, స్టోర్‌రూమ్‌లను పరిశీలించారు. అనంతరం తరగతిగదిలోకి వెళ్లి విద్యార్థులకు పాఠాలు చెప్పి, పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు నిర్దేశిత మెనూ ప్రకారం భోజనం అందించాలని విద్యాసంస్థల ఓఎస్డీ సర్వర్ మియాను ఆదేశించారు.

### మట్టి గణపతులను పూజిద్దాం



విగ్రహాలు పంపిణీ చేస్తున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్: మట్టి గణపతులను పూజించడం శ్రేయస్కరమని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ ముందు మట్టిగణపతుల పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. పౌరులందరిపై సంస్కృతి, సంప్రదాయాలను, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, కౌన్సిలర్లు పత్తిపాక పద్మ, లింగంపల్లి సత్యనారాయణ, బొల్గం నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

**కాలుష్య నివారణలో బాధ్యత వహించాలి**

మట్టి గణపతులను పూజించడం శ్రేష్ఠమని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్ల మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, గోదావరి పాలిమర్స్ డీలర్ చింతోజు భాస్కర్ నేతృత్వంలో నిర్వహించిన మట్టి గణపతుల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో జలాశయాల్లో కాలుష్యం పెరుగుతుందన్నారు. చింతోజు నారాయణ, దుర్గాచారి తదితరులు పాల్గొన్నారు.

### జెడ్పీ సీఈవో తనిఖీ



బోయినపల్లిలో జెడ్పీ సీఈవో వినోద్ తనిఖీ

బోయినపల్లి(చొప్పదండి): మండల పరిషత్‌ను జెడ్పీ సీఈవో ఎస్.వినోద్ శుక్రవారం తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించారు. ఉద్యోగుల హాజరు శాతం, నిధుల వివరాలు తనిఖీ చేశారు. ఎంపీడీవో బీమా జయశీల, పర్యవేక్షకులు రవీందర్, గడ్డం శ్రీనివాస్, వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ



తాళ్లపల్లిలో పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని కందికట్కూర్, పొత్తూరు, వంతడ్పుల, కేసన్నపల్లె, తాళ్లపల్లి, రేపాక గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం తనిఖీ చేశారు. ఈనెల 1 నుంచి 30 వరకు ఐసీడీఎస్ ప్రాజెక్టులో పోషణ్ మహా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు అందించే పోషకాహారాన్ని పరిశీలించారు. సూపర్‌వైజర్‌లు సూర్యకళ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

### డెంగీ మృతిపై విచారణ



విచారణ చేపడుతున్న వైద్యాధికారులు

రుద్రంగి(వేములవాడ): డెంగీతోపాటు ఇంజక్షన్ వికటించి నోముల రవి మృతిచెందిన ఘటనపై వైద్యాధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. డాక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ గత 15 రోజులుగా డెంగీ లక్షణాలతో బాధపడుతూ, ప్రైవేట్ వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

### రోడ్లు, వంతెనలు పూర్తి చేయండి

- హైదరాబాద్‌లో అధికారులతో ప్రభుత్వ విప్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బి రోడ్లు, వంతెనల నిర్మాణాలపై హైదరాబాద్‌లోని ఇంజినీర్-ఇన్-చీఫ్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ (రోడ్స్) మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో అత్యవసరంగా నిర్మించాల్సిన వంతెనలు, రోడ్లపై సమీక్షించారు. వేములవాడలోని మూలవాగుపై తిప్పాపూర్ బ్రిడ్జి, కోనరావుపేట మండల పరిధిలోని మూలవాగుపై నాలుగు హైలెవల్ బ్రిడ్జీలు, కోనరావుపేట మండలం నిమ్మపల్లి వద్ద పెంటివాగుపై బ్రిడ్జి, చందుర్తి మోత్కరావుపేట మధ్య రోడ్డు, చందుర్తి మండలం మల్యాలలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై బ్రిడ్జి, చందుర్తి మండలం మర్రిగడ్డ-జోగాపూర్ మధ్య బ్రిడ్జి, కథలాపూర్ మండల పరిధిలోని సిరికొండ-తక్కళ్లపల్లి బ్రిడ్జి, తాండ్రియాల- గంభీర్‌పూర్ మధ్య బ్రిడ్జి, మేడిపల్లి మండల పరిధిలోని కొండాపూర్-ఒడ్డాడు మధ్య బ్రిడ్జీలను అత్యవసరంగా నిర్మించాలని ఆదేశించారు. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల అధికారులు ఎస్ఈ బి.లక్ష్మణ్, ఈఈలు సాంబశివరావు, శ్రీనివాసరావు, డీఈలు శాంతయ్య, వెంకటరమణ, బాపురెడ్డి, ఏఈలు కిరణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

### విద్యుత్ దీపాల కాంతుల్లో రాజన్న ఆలయం




విద్యుత్ కాంతుల్లో రాజన్న ఆలయం

వేములవాడ: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వేములవాడ రాజన్న ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాజన్న ఆలయం విద్యుత్ దీపాల వెలుతురులో ఆకట్టుకుంటుంది.







## క్లుప్తంగా

### వరద కాలువలో వ్యక్తి మృతదేహం


గంగాధర(చొప్పదండి): మండలంలోని ర్యాలపల్లి శివారు వరద కాలువలో ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకు వచ్చింది. లోపల పైపులకు తట్టుకోవడంతో శుక్రవారం ఉదయం అటుగా వెళ్లిన రైతులకు కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే అక్కడికి చేరుకొని, మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డుపై బొట్ల శ్రీనివాస్ అని ఉన్నట్లు పేర్కొన్నారు. అతని వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని గుంపులకు చెందిన మలగల సదానందం అలియాస్ ఆరెపల్లి సదయ్య, కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కాట్నపల్లి మల్లన్నపల్లికి చెందిన బండారి యాదగిరిలకు విద్యుత్ చౌర్యం కేసులో న్యాయమూర్తులు జరిమానా విధించారని విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎండీ.షాదుల్లా బాబా తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సదానందం, యాదగిరిలు తమ ఇళ్లకు విద్యుత్ శాఖ అనుమతి లేకుండా కరెంట్ వాడుతుండగా సంబంధిత అధికారులు పట్టుకొని, విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మొదటి నేరంగా భావించి, కేసు నమోదు చేసి, రూ.500 చొప్పున జరిమానా విధించి, వదిలేశారు. కానీ, ఆ ఇద్దరూ మళ్లీ విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తూ పట్టుబడగా కేసు నమోదు చేసి, ఆయా జిల్లాల న్యాయస్థానాల్లో హాజరుపర్చారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు వారు ఒప్పుకున్నారు. దీంతో సదానందం రూ.15,169 జరిమానా చెల్లించాలని లేదంటే మూడు నెలల జైలుశిక్ష అనుభవించాలని పెద్దపల్లి జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.హేమంత్ శుక్రవారం తీర్పు చెప్పారు. అలాగే, యాదగిరి రూ.4,371 జరిమానా చెల్లించాలని లేదంటే ఒక నెల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని కరీంనగర్ జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి డి.వెంకటేశ్ తీర్పు వెల్లడించారు.

# లలిత గీతాల కవి ఇకలేరు

- అనారోగ్యంతో సినారె శిష్యుడు వడ్డేపల్లి కృష్ణ కన్నుమూత
- బహుముఖ సాహితీ ప్రక్రియల్లో దిట్ట
- సినీ గీత రచయిత, దర్శకుడిగా గుర్తింపు
- సిరిసిల్ల చేనేత కుటుంబంలో జననం
- ఐదు దశాబ్దాలపాటు సాహితీ సేద్యం


కృష్ణ (ఫైల్)

సిరిసిల్ల కల్చరల్: లలిత గీతాల రచనతో జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకున్న రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ కవి వడ్డేపెల్లి కృష్ణ(76) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచారు. సిరిసిల్ల చేనేత కుటుంబంలో పుట్టి హైదరాబాద్ నాగోల్‌లో స్థిరపడ్డారు. సి.నారాయణరెడ్డి(సినారె) శిష్యుడిగా కవితా వ్యాసంగంలో కాలుమోపిన ఆయన పలు సాహితీ ప్రక్రియల్లో రాణించి, ఐదు దశాబ్దాలపాటు నిరంతర సాహితీ సేద్యం చేశారు.

**పోస్టల్ శాఖలో గుమాస్తాగా చేరి..**

నేత కార్మిక కుటుంబానికి చెందిన వడ్డేపెల్లి లింగయ్య–లక్ష్మమ్మ దంపతులకు 30 జూలై, 1949లో కృష్ణ జన్మించారు. డాక్టర్ కావాలనుకున్నా ఆయన ఆర్థిక ఇబ్బందులతో కాలేకపోయారు. పోస్టల్ శాఖలో గుమాస్తాగా చేరారు. 1973లో డిగ్రీ, 1978లో ఎంఏ, తర్వాత పీహెచ్‌డీ చేశారు. 1966–67 కాలంలో పీయూసీ చదువుతున్నప్పుడు సినారెతో పరిచయం ఏర్పడి, సాహిత్యం వైపు నడిచారు. 1970–79 కాలంలో యువసాహితీ సమితిని స్థాపించి, అనేక సాహిత్య సదస్సులు నిర్వహించారు. తన ఆరో ఏటనే తారాపతి వేషం వేశారు. ఆపై పలు నాటకాల్లో పాత్రలతో మెప్పించారు. 1964లో కళాశాల పత్రిక తరంగిణిలో విధి లిఖితం అనే కథ రాశారు.

**సినిమాలకు పాటలు..**

లలితగీతాలపై పరిశోధన చేసిన కృష్ణ డాక్టరేట్ పొందారు. తెలంగాణ వైభవం, తెలంగాణ పుణ్యక్షేత్రాలు, రామప్ప వంటి సంగీత నృత్య రూపకాలను ప్రదర్శింపజేశారు. నట దర్శకురాలు భానుమతి, అక్కినేని నాగేశ్వరరావు, సినారె ప్రోత్సాహంతో పలు సినిమాలకు పాటలు రాశారు. పెద్దరికం సినిమాలో అన్ని పాటలనూ ఆయనే రాయడం విశేషం. పలు టీవీ సీరియళ్లు, చలన చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లో తన ప్రయాణాన్ని సాగిస్తూ పలు డాక్యుమెంటరీలు నిర్మించారు. భక్తకవి పోతన, భారతీయ సంస్కృతి శిఖరాలు ఇప్పటికీ పునఃప్రసారమవుతున్నాయి. 'పాటవెలదులు' అనే సాహిత్య ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

**దేశ విదేశాల్లో సాహిత్య సదస్సులు**

దేశ విదేశాల్లో సాహిత్య సదస్సుల్లో పలుమార్లు పాల్గొన్నారు. సుమారు 30 కావ్యాలు, 60కి పైగా ఆడియో ఆల్బమ్స్, 52 రూపకాలు, 60 గజల్ గీతాలు, 90కి పైగా టీవీ ధారావాహికలు, 15 డాక్యుమెంటరీలు, 7 సీరియళ్లు, 200కు పైగా సినీగీతాలు, మరో 200కు పైగా పాట వెలదులు, ముక్తకాలు, కథలు, కథానికలు వెలువరించారు. వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో అప్పటి ఎమ్మెల్యే సీహెచ్.రాజేశ్వరరావు సమక్షంలో సినీనటి జమున చేతులమీదుగా గేయ కిరీటి బిరుదు అందుకున్నారు. నంది పురస్కారాల కమిటీ కమిటీ చైర్మన్‌గా, అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవ న్యాయ నిర్ణేతల కమిటీలో సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రులు నందమూరి తారక రామారావు, ఎన్.జనార్దన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు, వైఎస్.రాజశేఖరరెడ్డి, కొణిజేటి రోశయ్య చేతులమీదుగా ప్రభుత్వ పురస్కారాలు పొందారు.

**మాజీ మంత్రి కేటీఆర్ సంతాపం**

వడ్డేపెల్లి కృష్ణ మృతికి మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సంతాపం వెలిబుచ్చారు. అనేక సాహితీ ప్రక్రియల్లో రాణించిన ఆయనకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. సాహిత్య రంగానికి మరింత సేవ చేయాలన్న తపన కలిగిన కృష్ణ మరణం తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

**జిల్లా రచయితల నివాళి**

రాజన్నసిరిసిల్ల జిల్లా రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి ప్రతినిధులు, రచయితలు సిరిసిల్ల గాంధీ సర్కిల్‌లో వడ్డేపల్లి కృష్ణ చిత్రపటానికి నివాళి అర్పించారు. సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి, డాక్టర్ వాసరవేని పర్శరాం, జనపాల శంకరయ్య, కోడం నారాయణ, బూర దేవానందం, కొక్కుల రాజేశం, వెంగల లక్ష్మణ్, ఆడెపు లక్ష్మణ్, గుండెల్లి వంశీ తదితరులున్నారు.


బురద రోడ్డుపై ఇబ్బంది పడుతూ మృతదేహాన్ని తరలిస్తున్న బంధువులు

## చచ్చినా.. చావే

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: పై ఫొటో ఎక్కడో ఏజెన్సీ ప్రాంతంలోనిది అనుకుంటే పొరపాటే. ఇది ముమ్మాటికీ ఆరుసార్లు స్వచ్ఛతలో జాతీయ, రాష్ట్రస్థాయిలో అవార్డులు పొందిన సిరిసిల్ల మున్సిపల్ పరిధి ఒకటో వార్డు రగుడులోనిది. ఇక్కడ ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించేవారికి చావే అవుతోంది. గ్రామం నుంచి శ్మశానవాటికకు వెళ్లే దారిలో వానాకాలం పలుచోట్ల ఇలా బురద రోడ్డు దాటాల్సి ఉంటుంది. రగుడుకు చెందిన కాసర్ల శ్రీనివాస్(45) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. కుటుంబసభ్యులు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాన్ని తీసుకెళ్తూ బురద రోడ్డుపై నానాతంటాలు పడ్డారు. రోడ్డుకు మరమ్మతు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# మట్టి వినాయకులను పూజిద్దాం


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ: మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. పట్టణంలోని పాత ఆంధ్రాబ్యాంకు చౌరస్తాలో ఏర్పాటు చేసిన మండపంలో మట్టి వినాయక ప్రతిమలను శుక్రవారం పంపిణీ చేశారు.

ఇల్లంతకుంట(మానకొండూర్): మట్టి వినాయకులనే పూజించాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. ఇల్లంతకుంటలో శుక్రవారం భారత్ గ్యాస్ ఏజెన్సీలో మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేశారు. ఏజెన్సీ నిర్వాహకుడు నలమాచు శ్రీనివాస్, నాయకులు పసుల వెంకటి, అనంతగిరి వినయ్‌కుమార్, వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్య, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, ఎండీ జమాల్, బెజ్జంకి శ్రీను పాల్గొన్నారు.


విగ్రహాలను పంపిణీ చేస్తున్న ప్రతాప రామకృష్ణ

# హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎంలు పద్మజ, రత్నాకర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): రామడుగు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–15 సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను హైస్కూల్ హెచ్‌ఎం పద్మజ, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం రత్నాకర్‌రెడ్డి ప్రారంభించారు. పలు పాఠశాలలకు చెందిన 250 మంది క్రీడాకారులు హాజరయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్టును ఈ నెల 14, 15వ తేదీల్లో హనుమకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ స్వరూపారాణి, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, కోచ్ వెంకటేశ్, పీఈటీలు పాల్గొన్నారు.

## నేతన్నల సమస్యలపై సీఎం స్పందించాలి

- పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

సిరిసిల్లటౌన్: నేతకార్మికుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ కోరారు. సిరిసిల్లలోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శుక్రవారం నిర్వహిచిన కార్మిక యూనియన్ సమావేశంలో మాట్లాడారు. 2023లో బతుకమ్మ చీరల సబ్సిడీ యారన్, వర్కర్ టు ఓనర్ పథకం తదితర అంశాలపై కార్మికుల సంతకాల సేకరణతో ముఖ్యమంత్రికి విన్నవించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఉపాధి లేక 8 నెలలుగా 12 మంది నేతకార్మికులు బలవన్మరణాలకు పాల్పడినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు సురేశ్, శేఖర్, శ్రీధర్, రమేశ్, గణేశ్, శ్రీనివాస్, సదానందం, రాజేశం, నారాయణ పాల్గొన్నారు.

## రేపు ఖోఖో జట్ల ఎంపిక

కరీంనగర్ కల్చరల్: ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలను ఆదివారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మహేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతిభ కనబరిచే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. హాజరవ్వాలనుకునే క్రీడాకారుల ఇండెక్స్ మొత్తం 215 పాయింట్లు దాటరాదని తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య

తిమ్మాపూర్(మానకొండూర్): నల్లగొండకు చెందిన నర్రెంకుల నరేశ్(35) ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. నరేశ్ హిందుస్థాన్ మైక్రో ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.5లక్షలు హౌసింగ్ లోన్ తీసుకున్నాడు. ఆ రుణాన్ని తీర్చలేకపోయాడు. దీంతో ఫైనాన్స్ సంస్థ నుంచి ఒత్తిడి పెరిగింది. మనస్తాపానికి గురైన నరేశ్ శుక్రవారం తెల్లవారుజామున గ్రామ ప్రభుత్వ నర్సరీలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఉదయం గుర్తించిన స్థానికులు మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

## జిల్లాలో భారీ వర్షం


వేములవాడలో నిలిచిన వాహనాలు


సిరిసిల్ల కొత్త బస్టాండ్‌లో వరద

సిరిసిల్ల/వేములవాడ: రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి హఠాత్తుగా భారీ వర్షం కురిసింది. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఈదురుగాలులతో కూడిన వాన కురిసింది. వేములవాడలో శుక్రవారం రాత్రి అరగంటపాటు భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్ర ఎండ, ఉక్కపోత ఉంది. రాత్రి 7 గంటల నుంచి 7.30 గంటల వరకు భారీ వర్షం కురవడంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. సిరిసిల్లలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో వరదనీరు రోడ్డుపైకి వచ్చింది.

# ఒక్క అధికారి.. నాలుగు మండలాలు!

- జిల్లాలో వ్యవసాయాధికారుల కొరత

సిరిసిల్ల: ఒక్క అధికారికి.. ఒక్కటి కాదు.. రెండు కాదు.... ఏకంగా మూడు మండలాల అదనపు బాధ్యతలు ఇచ్చారు. అంటే.. నాలుగు మండలాలకు ఒక్కరే అధికారి అన్నట్లు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల వ్యవసాయాధికారుల(ఎంఏవో)ల బదిలీలు జరిగాయి. సిరిసిల్ల వ్యవసాయాధికారిగా కె.సందీప్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు అదనంగా ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాలకు ఇన్‌చార్జి అధికారిగా నియమించారు. మండల వ్యవసాయాధికారుల పోస్టులు భర్తీ కాకపోవడంతో ఉన్న అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ఇల్లంతకుంట వ్యవసాయాధికారి సురేశ్‌రెడ్డికి ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల అదనపు బాధ్యతలు అప్పగించారు. చందుర్తి వ్యవసాయాధికారి దుర్గారాజుకు రుద్రంగి మండలానికి ఇన్‌చార్జిగా నియమించారు. వేములవాడ అర్బన్ వ్యవసాయాధికారి సాయికిరణ్‌కు వేములవాడ రూరల్, కోనరావుపేట మండలాలను అదనంగా అప్పగించారు. ఒక్క బోయినపల్లి వ్యవసాయాధికారి ప్రణీతకు ఒకే మండలం ఉంది. జిల్లాలోని 13 మండలాలకు ఐదుగురు వ్యవసాయాధికారులు ఉన్నారు. సిరిసిల్ల వ్యవసాయాధికారి సందీప్‌కు మాత్రం ఏకంగా మూడు మండలాలకు అదనపు బాధ్యతలు ఇవ్వడం విశేషం. రైతు రుణమాఫీ ఫిర్యాదులు, ఆన్‌లైన్ నమోదు వంటి కీలకమైన పనులు జరుగుతున్న తరుణంలో జిల్లాలో మండల వ్యవసాయాధికారులకు అదనపు బాధ్యతలు ఇవ్వడం గమనించాల్సిన విషయం.

## పోక్సో కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల కల్చరల్: బాలికపై లైంగికదాడికి యత్నించిన కేసులో ఓ వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత తీర్పునిచ్చారు. ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాల ప్రకారం.. 2018 డిసెంబర్ 25న ఇల్లంతకుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో స్థానికుడైన చీపెల్లి మల్లయ్య ఆమె వద్దకు వచ్చాడు. బిస్కెట్లు ఆశ చూపి, మాయమాటలు చెప్పి, తన ఇంటికి తీసుకెళ్లి, లైంగిక దాడికి యత్నించాడు. ఈ విషయాన్ని బాధితురాలు మరుసటి రోజు తల్లికి తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు ఇల్లంతకుంట పోలీసులు మల్లయ్యపై పోక్సో కేసు నమోదు చేశారు. అతన్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ శ్రీనివాస్ వాదించగా సీఎంఎస్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో 12 మంది సాక్షులను విచారించారు. న్యాయమూర్తి కేసు పూర్వాపరాలను పరిశీలించి, మల్లయ్యకు శుక్రవారం శిక్ష ఖరారు చేశారు.

## ఐసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టీజీఐసెట్ ప్రవేశపరీక్షలో ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు శుక్రవారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తొలిరోజు 290 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని తెలిపారు. అధ్యాపకులు కుమారస్వామి, శరణ్య, రాజు, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, శ్రీధర్ ఉన్నారు.

## డెంగీ లక్షణాలతో మహిళ మృతి

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రానికి చెందిన చలిగంటి లక్ష్మి(50) డెంగీ లక్షణాలతో మృతిచెందింది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. లక్ష్మి జ్వరంతో బాధపడుతూ నాలుగు రోజుల క్రితం స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు శుక్రవారం హుటాహుటిన వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. దవాఖానాలో చేర్పిన వెంటనే ఆమె చనిపోయింది.

వినాయకచవితి శుభాకాంక్షలు
DISTANCE EDU.ONLINE
B.A, B.Com, B.B.A, MCJ
M.B.A, M.C.A, M.Com, MSW
M.A. B.Li.Sc, M.Li.Sc. Psychology, Diploma Open INTER, SSC
SRI KALKI - JAGTIAL
9666954666, 9298259856, 9494357266

I.T.I. Admissions Open In
Sadhu Venkatreddy I.T.I.
Course's: Electrician, Diesel Mechanic
Vill & Mdl : Yellareddypeta, Dist: Rajanna Siricilla
Ph: 9848184026 (or) 8341770025

వినాయక చవితి శుభాకాంక్షలు.
కరీంనగర్ జిల్లా ప్రజలకు, అధికారులకు, నాయకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు...

Prof. డా॥ ఎల్. రవికాంత్
M.S. (E.N.T.)
చెవి, ముక్కు, గొంతు మరియు అలర్జీ నిపుణులు
చికిత్సలు: చెవిలో చీము కారుట, చెవి నొప్పి / చెవి పోటు, గులిమి (Wax), వినికిడి లోపం, తల తిప్పుట, వర్టిగో, డిజనస్, టిన్నిటస్ (చెవిలో హోరు), తల నొప్పి, ముక్కు దిబ్బడ, మైగ్రేన్, అలర్జీ (తుమ్ములు), ముక్కులో పాలిప్స్, కుతికలు, అడినాయిడ్స్, సెప్టో ప్లాస్టీ, థైరాయిడ్, పరోటిడ్ గ్రంథులలో గడ్డలు, కంతులు, గురక
శస్త్ర చికిత్సలు: అధునాతన కోబ్లేటర్‌తో కుతికలు, అడెనాయిడ్స్, FESS నాసల్ ఎండోస్కోపిక్ సర్జరీలు, మైక్రో ఇయర్, లారింజియల్, థైరాయిడ్, హెడ్ & నెక్ సర్జరీలు, గురక సర్జరీలు
అత్యాధునిక ఆడియాలజీ ల్యాబ్
మొట్టమొదటిసారిగా BERA, VEMP, ECOCHG
స్పెషలైజ్డ్ వెర్టిగో ల్యాబ్
స్లీప్ ల్యాబ్
Facilities: NASAL ENDOSCOPY, VIDEO LARYNGOSCOPY, SNORING EVALUATION / SLEEP STUDIES VERTIGO EVALUATION, AUDIOLOGICAL EVALUTION, PTA IA, OAE, BERA, ECochG, VEMP
మెటా
చెవి, ముక్కు, గొంతు H&N సెంటర్
మాతా శిశు సెంటర్ ఎదురుగా, ప్రసన్నాంజనేయ స్వామి టెంపుల్ దగ్గర, ప్రశాంత్ నగర్ రోడ్, కరీంనగర్.
Help Line: 92810 69080, 94405 30640


హార్దిక శుభాకాంక్షలు
మా ప్రియ మిత్రుడు శ్రీ టి.కళ్యాణచక్రవర్తి సీనియర్ న్యాయవాది గారు గౌరవ డిస్ట్రిక్ట్ & సెషన్స్ కోర్టు, రాజన్న సిరిసిల్ల యొక్క గవర్నమెంట్ ప్లీడర్‌గా నియామకమైన సందర్భంగా వారికి ఇవే మా హార్దిక శుభాకాంక్షలు...
శ్రీ టి.కళ్యాణచక్రవర్తి గారు
Government Pleader
Hon'ble District Sessions Court
Rajanna Sircilla District
M.G. LAW ASSOCIATES-SIRCILLA
చెక్కిళ్ల మహేష్ గౌడ్ న్యాయవాది
గుండ రవి న్యాయవాది
వెలుముల గోవర్ధన్‌రెడ్డి న్యాయవాది
గడ్డం అంజనేయులు న్యాయవాది
ఆకుమారి సురేష్ ప్రసాద్ న్యాయవాది
వంగపెల్లి ప్రశాంత్ న్యాయవాది
మరాపు దేవయ్య న్యాయవాది
వంగ పర్శరాములు న్యాయవాది
బండి చైతన్య గౌడ్ న్యాయవాది
బొద్దుల రాజేష్ న్యాయవాది
తౌటు మరుసరస్ న్యాయవాది
కుసుమ అర్చన న్యాయవాది

వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు
సుమ హాస్పిటల్
సివిల్ హాస్పిటల్ ప్రక్కన, డా॥ రమణాచారి హాస్పిటల్ లైన్, కరీంనగర్.
సెల్: 9912 44 4343, 9912 42 4343
మిత్రులకు, శ్రేయోభిలాషులకు తోటి డాక్టర్లకు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు


డా॥ V.సుమలత
MD (Pulmonology)
చెస్ట్ ఫిజీషియన్
ఊపిరితిత్తులు, ఆస్తమా, అలర్జీ వ్యాధి నిపుణులు
24/7 Emergency Services
డా॥ L. వర్షి
MBBS, MD (Psy.) (Osm.)
IMH, Erragadda
నరాల, సెక్స్, ఆల్కహాల్ & మానసిక వైద్యనిపుణులు
★ అలర్జీ, ఆస్తమా, ఆయాసము ★ దగ్గు, దమ్ము, క్షయ (టి.బి.) ★ దగ్గులో రక్తం రావడం ★ పిల్లి కూతలు ★ దీర్ఘకాలిక ఊపిరితిత్తుల సమస్యలు ★ తుమ్ములు, ముక్కు కారడం, గురక ★ ఊపిరితిత్తుల్లో నీరు/ రక్తం/ నిమ్ము చేరడం ★ ఊపిరితిత్తుల క్యాన్సర్ ★ ఛాతి సమస్యలకు అత్యాధునిక చికిత్స చేయబడును.
★ తలనొప్పి, నరాల సమస్యలు ★ సెక్స్ సమస్యలు, నిద్ర సమస్యలు ★ మద్యపానము, ఒసిడి ★ చిన్న పిల్లల జ్ఞాపకశక్తి సమస్యలు ★ డిప్రెషన్, అతి ఆందోళన, ఫోబియా ★ చదువులో వెనుకబడుట ★ మాటలు రాకపోవడం, ఫోన్ అడిక్షన్ ★ అన్ని రకముల నరాల & మానసిక సమస్యలకు ఆధునిక చికిత్స, కౌన్సిలింగ్ ఇవ్వబడును.
Facilities: ★ CHEST X-RAY ★ PFT ★ ECG ★ CT SCAN ★ LAB ★ SLEEP TEST ★ SKIN ALLERGY TEST

సాక్షి క్లాసిఫైడ్స్
EDUCATION
ITI Admissions
■ సాయి Pvt. I.T.I., జగిత్యాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ & మెకానిక్, డీజిల్ ట్రేడ్లలో చివరి అవకాశముగా అడ్మిషన్లు జరుగుచున్నవి. వెంటనే సంప్ర: సెల్: 8106371128. గమనిక: B.Tech/Diploma in Electrical, Mechanical, MBA/ MCA వారు Instructor గా పని చేయుటకు కావలెను. saiiti1992@gmail.com కు దరఖాస్తు చేసుకోగలరు. [K-1246695]
SERVICES
BUSINESS OFFER
■ నిజంగా డబ్బులు సంపాదించాలి అనే వాళ్లకు, మంచి అవకాశం నెలకు 30 K - లక్ష సంపాదన మీ వాట్సప్ స్టేటస్‌తో. ఫోన్: 9948217574 [SCA24000234]
WANTED
■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ:18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796272]
www.sakshi.com
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824